
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం ၊ 4 ၊ ఫిబ్రవరి ၊ 2024



సోమశిలలో 24.898 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం సాయంత్రానికి 24.898 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువల ద్వారా 3,180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,819
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,994
నవర (8 గ్రాములు)	రూ.47,952

గరిష్టం/కనిష్టం
32.0 /24.6

వాతావరణం

శనివారం గాలిలో తేమ 55 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. ఆదివారం ఎలాంటి మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

సచివాలయాల్లో వేగంగా రిజిస్ట్రేషన్లు

- ట్రైయినీ కలెక్టర్ సంజనాసిన్హా



రిజిస్ట్రేషన్ల వివరాలను పరిశీలిస్తున్న ట్రైయినీ కలెక్టర్ సంజనాసిన్హా

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు వేగంగా జరుగుతున్నాయని ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌తో పలు అంశాలపై ఆరా తీశారు. గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొత్తం రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా మానిటరింగ్ చేస్తుండడంతో ఏ మేరకు రిజిస్ట్రేషన్లు జరిగాయో పరిశీలించారు. ఆత్మకూరు మండలంలో 15, అనంతసాగరంలో 51, ఏఎస్‌పేటలో 78, ఉదయగిరిలో 48, మర్రిపాడులో 23, సంగం మండలంలో 43 ఇలా మొత్తం 258 రిజిస్ట్రేషన్లు ఇప్పటి వరకు జరిగినట్లు ఆమె తెలిపారు. డివిజన్ పరిధిలో 109 గ్రామాల డేటా పోర్ట్ అయినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించి వివరాలను తనకు తెలియజేయాలని సబ్ రిజిస్ట్రార్‌కు సూచించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పాల సేకరణ కేంద్రాలకు లైసెన్స్ తప్పనిసరి

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మహేశ్వరుడు



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మహేశ్వరుడు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో పాలు సేకరించే కేంద్రాలు ఇక నుంచి పశుసంవర్ధకశాఖ నుంచి లైసెన్సు తప్పకుండా తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మహేశ్వరుడు తెలిపారు. శనివారం నెల్లూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న తన కార్యాలయంలో ఆ శాఖ అధికారులకు మిల్క్ యాక్ట్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్క్ యాక్ట్ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. పాల సేకరణ కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా కల్తీ లేకుండా నాణ్యమైన పాలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాల సేకరణ కేంద్రాలు లైసెన్సు తీసుకోకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఈ లైసెన్సులు జారీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అధికారులు కోటేశ్వరరావు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.







జగన్నాథ రథయాత్రలో స్వామివారికి హారతులిస్తున్న ఇస్కాన్ అర్చకులు, రథం లాగుతున్న అశేష భక్తజనం, కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

జయహో జగన్నాథా

శ్రీగౌర-నితాయ్‌ల రథయాత్రతో శోభిల్లిన సింహపురి

- నగరంలో మార్మోగిన జగన్నాథుని నామం
- వేలాదిగా పాల్గొని తరించిన భక్తులు

నెల్లూరు(బృందావనం): జగన్నాథుని నామస్మరణతో సింహపురి హోరెత్తింది. వేలాది మంది భక్తులు గోవింద నామాన్ని ధరించి హరేకృష్ణ హరేకృష్ణ.. కృష్ణ కృష్ణ హరేహరే స్వామి నామాన్ని జపించారు. భక్తి పారవశ్యంతో స్వామి పాటలను ఆలపించారు. మంగళ వాయిద్యాల హోరు, కోలాట భజన బృందాల కోలాహలం, పలు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన పుష్పాలంకృత రథంపై కొలువైన శ్రీగౌర-నితాయ్ (శ్రీకృష్ణబలరామ) రథయాత్ర సింహపురిలో శనివారం వైభవంగా సాగింది. అంతర్జాతీయ శ్రీకృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ రథయాత్రతో నెల్లూరు నగరం శోభిల్లింది. ఇస్కాన్ నెల్లూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి పర్యవేక్షణలో రథయాత్ర సంతపేట నాలుగుకాళ్ల మండపం వద్ద నుంచి ప్రారంభమై మినీబైపాస్‌రోడ్డు అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న పీవీఆర్ కల్యాణ మండపం వరకు నయనానందకరంగా సాగింది. అంతర్జాతీయ శ్రీకృష్ణచైతన్య సంఘం జనరల్ బాడీ కమిషన్ (ఇస్కాన్ జీబీసీ) చైర్మన్ రేవతిరామన్‌దాస్ మహాప్రభు ముఖ్యఅతిథిగా విచ్చేసి రథంపై కొలువైన శ్రీగౌర-నితాయ్‌లకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. మహిళా భక్తులు ఒకవైపు, పురుషులు మరొక వైపు చేరి రథాన్ని లాగుతూ ముందుకు కదిలించారు.

వేడుకగా సాగుతూ..

రథయాత్ర సంతపేట నాలుగుకాళ్ల మండపం నుంచి ఏసీ బొమ్మ సెంటర్, ట్రంకురోడ్డు, వీఆర్సీ సెంటర్, ముత్తుకూరు గేట్, మినీబైపాస్‌రోడ్డు, అన్నమయ్య సర్కిల్ మీదుగా పీవీఆర్ కల్యాణ మండపానికి చేరింది. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ఇస్కాన్ మందిర స్వాములు భగవత్ సందేశాన్నిచ్చారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వేదికపై శ్రీగౌర -నితాయ్‌లకు చప్పన్‌భోగ్ (56 వంటకాలతో) నివేదన, హారతి కీర్తన, దీపహారతులు సమర్పించారు. అనంతరం రథయాత్రలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ జీబీసీ కమిషన్ చైర్మన్ రేవతిరామన్‌దాస్ మాట్లాడుతూ జీవితంలో నిత్య ఆనందాన్ని, సులభంగా మోక్షాన్ని కలిగించే హరేకృష్ణ హరే రామ మహామంత్రం ఎంతో మహిమాన్వితమైనదని పేర్కొన్నారు. పరమాత్ముడైన శ్రీకృష్ణభగవానుని నామస్మరణతో ఎలాంటి సమస్యలు దరిచేరవన్నారు. డాక్టర్ సుఖదేవస్వామి మాట్లాడుతూ నగరంలోని ఇస్కాన్ మందిరంలో నిత్య పూజలందుకుంటున్న శ్రీకృష్ణబలరాములను రథంపై దర్శించుకుని, సేవించుకునే మహద్భాగ్యం నగరవాసులకు లభించడం ఎంతో పుణ్యఫలమన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇస్కాన్ మందిరాల నిర్వాహకులు శ్రీనివాస శ్యామ్‌దాస్(హోసూరు), మహాశ్రింగదాస్(కూకట్ పల్లి), చక్రధారిదాస్ (విజయవాడ), జయగోపీనాథ్‌దాస్ (పెరంబదూరు), రూపేష్‌చైతన్యదాస్ (తిరుపతి), వైష్ణవ్‌కృపదాస్ (కర్నూలు), కీర్తిరాజ్ దాస్(చీరాల), కరుణసింధుదాస్(ఝాన్సీ), అమియానిమాయిదాస్ (ముజఫర్‌నగర్), మాధవగోవిందదాస్ (తెనాలి) తదితరులు పాల్గొని రథయాత్ర విశిష్టతపై ఉపన్యసించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులు, వివిధ రంగాల ప్రముఖులు తోడ్పాటునందించారు.

పకడ్బందీగా ప్రాక్టికల్స్

- రేపటి నుంచి ఒకేషనల్, 11వ తేదీ నుంచి ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్
- నాన్ జంబ్లింగ్ పద్ధతిలో 128 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 21 వేల మందికి పైగా విద్యార్థులు



సమావేశమైన ఆర్ఐఓ శ్రీనివాసులు, డీఈసీ కమిటీ సభ్యులు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పరీక్షలు సీసీ కెమెరాల నడుమ జరగనున్నాయి. ఈ నెల 5వ తేదీ నుంచి ఒకేషనల్, 11వ తేదీ నుంచి జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల్లో అవకతవకలకు తావులేకుండా ఉండేందుకు డీఈసీ కమిటీని, 4 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. డీఈసీ కమిటీ కన్వీనర్‌గా ఆర్ఐఓ శ్రీనివాసులు, సభ్యులుగా దీన్‌దయాళ్, వేణుగోపాల్, కొండయ్య, డీవీఈఓ మధుబాబులను నియమించారు. ఈ పరీక్షలు నాన్ జంబ్లింగ్ విధానంలో జరగనున్నాయి. విద్యార్థుల కోసం కంట్రోల్ రూమ్ - 2320 312ను ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సంబంధించి మొత్తం 21,521 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 19,567 మంది జనరల్, 1,954 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. జనరల్‌కు సంబంధించి బైపీసీ 2,822, ఎంపీసీ 16,745 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఒకేషనల్ విభాగంలో 3 విడతలు, జనరల్ విభాగంలో రెండు విడతలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 128 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు 400 మందికి పైగా ఎగ్జామినర్లు, 128 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించారు. ప్రైవేట్ కళాశాలలకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులను చీఫ్ సూపరింటెండెంట్‌లుగా నియమించనున్నారు. ప్రాక్టికల్స్ ఫలితాలు ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో మార్కులను నమోదు చేయాలని ఇంటర్ బోర్డు అధికారులు ఆదేశించారు.

> **అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు**
>
> ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరుగుతున్నందున కళాశాలల సమీపంలో ఇతర విద్యార్థులు, అధ్యాపకులు ఉండకూడదు. పరీక్షల కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేస్తాయి. ప్రాక్టికల్స్ పరీక్ష జరిగిన రోజే ఆ ఎగ్జామినర్ మార్కులను నమోదు చేస్తారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూంకి ఫోన్ చేయవచ్చు. – శ్రీనివాసులు, ఆర్ఐఓ

సీఎం సాహసోపేత నిర్ణయం 'ఆడుదాం ఆంధ్రా'

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- జిల్లాస్థాయి విజేతలకు బహుమతుల ప్రదానం



మాట్లాడుతున్న మంత్రి కాకాణి, వేదికపై కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్, విజయ డెయిరీ చైర్మన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారుల్లో ఆసక్తి పెంచేందుకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల పండగని నిర్వహించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం జరిగిన 'ఆడుదాం ఆంధ్రా' జిల్లాస్థాయి విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి పరిశీలిస్తే గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు యువతను క్రీడల్లో భాగస్వాములను చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. యువత క్రీడల్లో ఉత్సాహంగా క్రమశిక్షణతో పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడల పట్ల సమాజంలో, తల్లిదండ్రుల్లో మార్పు వచ్చిందన్నారు. ఆటలాడే వారికి గుర్తింపు లభిస్తోందని తెలిపారు. ఆన్‌లైన్ గేమ్స్‌కు పరిమితమైన ఈ రోజుల్లో విద్యకు, వ్యాయామానికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ క్రీడలు దినచర్యలో భాగం కావాలన్నారు. సెల్ ఫోన్లు, టీవీల వల్ల వచ్చే పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలనే ఉద్దేశంతో ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసేందుకు ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. మేయర్ స్రవంతి మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక, శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీఎస్‌డీఓ యతిరాజు, కోచ్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

96.25 శాతం పింఛన్ల అందజేత

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక నగదు పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. మూడో రోజు శనివారానికి 96.25 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ల నగదు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,18,983 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 3,07,026 మందికి పింఛన్ నగదు పంపిణీ చేశారు.

పదిలో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి

- జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి వెంకటయ్య



మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి వెంకటయ్య

నెల్లూరు(వేదాయపాళెం): సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి వెంకటయ్య తెలిపారు. నెల్లూరులోని మద్రాసు బస్టాండ్ సమీపంలో ఉన్న బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో శనివారం సహాయ బీసీ సంక్షేమ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 58 ప్రీమెట్రిక్ హాస్టళ్లలో 631 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారని, వారికి పరీక్షలపై భయం పోయేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతోపాటు మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. విద్యార్థులను మూడు గ్రేడ్‌లుగా విభజించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్–2 కోచింగ్, మెటీరియల్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం యశస్వి మెరిట్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జాబితాను ఆయా విద్యాసంస్థల హెచ్‌ఎం, ప్రిన్సిపల్స్ ఈ నెల 10వ తేదీ లోపు తమ కార్యాలయానికి పంపాలని తెలిపారు. దరఖాస్తుతోపాటు ఓబీసీ, ఇన్‌కం సర్టిఫికెట్లు, మార్కుల జాబితా, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్, ఆయా విద్యాసంస్థల ఫీజు రిసిప్ట్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కులగణన కార్యక్రమంలో బీసీ అధికారులు, వార్డెన్లు పాల్గొనాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంలో అలసత్వం వహించే వార్డెన్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి సహాయ బీసీ సంక్షేమ అధికారులు లక్ష్మీప్రసూన, శ్రీదేవి, తేజోవతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



లబ్ధిదారులకు భూపట్టాలు అందజేస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం,అభివృద్ధి నినాదంతో పల్లెలు ముందుకెళ్లింది లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో శనివారం ఆయన పర్యటించారు. రూ.47.50 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కాకాణి మాట్లాడారు. చెన్నారెడ్డిపల్లితో తమ కుటుంబానికి ఐదు దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. చెన్నారెడ్డిపల్లి తన స్వగ్రామంతో సమానమన్నారు. ఇప్పటి వరకు రూ.4 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. తమ కుటుంబానికి కంచుకోటగా ఉన్న గ్రామంలో కొన్ని అనివార్య కారణాలతో గత ఎన్నికల్లో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. ప్రస్తుతం గ్రామస్తులందరూ ఐకమత్యంగా నిలబడి రానున్న ఎన్నికల్లో ఓట్లు వేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు.

సాగు చేసుకునే వారికే భూపట్టాలు

సర్వేపల్లి నియోజకవర్గంలో సాగు చేసుకునే వారికే భూ పట్టాలను అందజేయడం జరిగిందని మంత్రి కాకాణి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో అసైన్మెంట్, పీఓటీలు కలిపి పది వేల ఎకరాలను అందజేస్తున్నట్టు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క జీఓతో 2.60 లక్షల ఎకరాల చుక్కల భూముల సమస్యను పరిష్కరించారన్నారు. చెన్నారెడ్డిపల్లిలో 326 ఎకరాల చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు. నావూరు రెవెన్యూ విలేజ్‌లో 277 కుటుంబాలకు 517 ఎకరాలను అందజేశామన్నారు. అందులో చెన్నారెడ్డిపల్లి రైతులకు 257 ఎకరాలకు భూపట్టాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. అనంతరం భూపట్టాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ కే వీరవసంతరావు, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వీఆర్వో రామయ్య, సర్పంచ్ వెల్మిరెడ్డి భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ నోటి సుబ్బరత్నమ్మ, నాయకులు నోటి బాలకొండారెడ్డి, వెల్మిరెడ్డి సుబ్బారెడ్డి, నీలం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు స్క్రిప్ట్‌ను వల్లెవేస్తున్న షర్మిల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టునే వల్లెవేస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతుంటే కనబడడం లేదా అని షర్మిలను ప్రశ్నించారు. గతంలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డిపై ఎఫ్ఐఆర్, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని జైలుకు పంపిన వారి పక్కన చేరి అడ్డగోలుగా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. జగన్ ఏ తప్పు చేశాడని విమర్శిస్తున్నావు...పార్టీలకతీతంగా ప్రజలకు సంక్షేమం అందించడం తప్పా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర చేసిన సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించిందో మరిచిపోయి చంద్రబాబుకు అమ్ముడుపోయి విమర్శలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ పోటీ చేసినా షర్మిలకు డిపాజిట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎప్పటికీ నమ్మరన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, టౌన్, రూరల్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, లక్ష్మీ సుబ్రహ్మ ణ్యంనాయుడు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే అవినీతిని నిరూపించాలి

- ఓటమి భయంతో రాజకీయ లబ్ధి కోసం టీడీపీ యత్నం
- ఎల్లో మీడియా ద్వారా అసత్య కథనాలు
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మీడియాకు రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): తెలుగుదేశం పార్టీకి తొత్తుగా వ్యవహరించే పచ్చ మీడియా ఏబీఎన్, టీవీ 5కు దమ్ము, ధైర్యం ఉంటే తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపించాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. నగరంలోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించబోతుందన్నారు. దాదాపు అన్ని చోట్ల అభ్యర్థులు ఖరారై ప్రచారంలో నిమగ్నమయ్యారన్నారు. తనకు ఎక్కడికి పోవాల్సిన అవసరం లేదని, కావలి నుంచే పోటీ చేస్తానన్నారు. పచ్చమీడియా దుష్ప్రచారాలను ప్రజలు నమ్మరన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించనున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల అన్నింటిని పరిష్కరిస్తున్నామన్నారు. తాను ఎప్పటికీ కావలి ప్రజల వెంటే ఉంటానన్నారు. కోవిడ్ కష్ట కాలంలో ఎన్నో సహాయ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కావలి ప్రజలు ఎప్పుడూ వైఎస్సార్‌సీపీకి మద్దతు పలుకుతారన్నారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి చెడ్డపేరు తేవాలనే టీడీపీ టికెట్ ఆశిస్తున్న కొందరు నేతలు పచ్చ మీడియాతో కలిసి దుష్ప్రచారం సాగిస్తున్నారన్నారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులపైన బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. బోగోలు మండలంలో భూములు ఆక్రమించానని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన కుమారుడు ఒక బహుళ జాతి కంపెనీ నుంచి భూమి కొనుగోలు చేస్తే ఆక్రమణకు పాల్పడినట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను చూపించారు. తాను ఆక్రమణలకు పాల్పడినట్లు నిరూపిస్తే భూమిని అనాథ ఆశ్రమానికి రాసిస్తానన్నారు. పచ్చమీడియాకు దమ్ముంటే అవినీతి ఆరోపణలను రుజువు చేయాలన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 125
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 224
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 145



నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.60
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.25



తహసీల్దార్లకు మండలాల కేటాయింపు

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పొరుగు జిల్లాల నుంచి జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లకు కలెక్టర్ హరినారాయణన్ శనివారం మండలాలు కేటాయించారు. నెల్లూరు రూరల్‌కు జీవీ సుబ్బారెడ్డి, నెల్లూరు అర్బన్‌కు బీ వెంకటేశ్వర్లు, కోవూరుకు జీ విజయశ్రీ, బుచ్చిరెడ్డిపాళేనికి పీ సురేష్‌బాబు, ఇందుకూరుపేటకు పీ సునీత, తోటపల్లిగూడూరుకు కే మాధవరెడ్డి, ముత్తుకూరుకు ఎల్ బాలకృష్ణ, వెంకటాచలానికి ఎం పూర్ణచంద్రరావు, మనుబోలుకు కే చిరంజీవి, పొదలకూరుకు వీర వసంతరావు, రాపూరుకు బీ వెంకటస్వామి, సైదాపురానికి టీ ప్రవీణ్ కుమార్, ఆత్మకూరుకు ఎస్ శివనాగిరెడ్డి, చేజర్లకు కే గోపికృష్ణ, ఏఎస్‌పేటకు కే రవికుమార్, మర్రిపాడు సీ సీతారత్నం, సంగానికి బీ రమాదేవి, అనంతసాగరానికి పీ నరసింహారావు, ఉదయగిరికి కే నెహ్రూబాబు, సీతారామపురానికి పీవీ కృష్ణారెడ్డి, కలువాయికి సీహెచ్ శ్రీనివాసులు, కావలికి కే నాగేష్, బోగోలుకు ఎం క్షమారాణి, అల్లూరుకు ఎస్ దుర్గేశ్వరరావు, దగదర్తికి పీ జాన్‌పీటర్, జలదంకికి ఎస్ వాసు, కలిగిరికి బాలకిషోర్, దుత్తలూరుకు ఎస్ వెంకటరత్నం, కొడవలూరుకు పీ శైలేంద్రకుమార్, విడవలూరుకు షేక్ ఇస్మాయిల్, వింజమూరుకు ఎంవీ కృష్ణారెడ్డి, కందుకూరుకు పీ కృష్ణకాంత్, గుడ్లూరుకు ఏవీ రమణ, లింగసముద్రానికి జీ శ్రీచరణ్, ఉలవపాడుకు కే రవిబాబు, వలేటివారిపాళేనికి ఎస్ నాగమల్లేశ్వరరావు, కొండాపురానికి డీ శ్రావణ్‌కుమార్, వరికుంటపాడుకు ఏవీపీ చంద్రారెడ్డి, నెల్లూరు డీఏఓకు కే సంజీవరావు, భూసేకరణ ప్రత్యేక తహసీల్దార్‌గా బీ సుశీల, కలెక్టరేట్ ల్యాండ్ రికార్డ్స్ స్పెషల్ తహసీల్దార్‌గా ఎం రాజ్యలక్ష్మిను నియమించారు. నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ ఏఓ దూబగుంట మధుసూదన్‌శర్మను కలెక్టరేట్ పరిపాలనాధికారిగా బదిలీ చేశారు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సభ్యుడిగా సుబ్రహ్మణ్యం



సీవీ సుబ్రహ్మణ్యం

నెల్లూరు సిటీ: ఆర్‌ఎస్‌ఎస్ నెల్లూరు అధ్యక్షుడు, జయభారత్ ఆస్పత్రి కమిటీ సభ్యుడు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం ఆయుష్మాన్ భారత్‌లో డిజిటల్ మిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అయుష్మాన్ భారత్‌ను పటిష్టంగా అమలు చేయడం కోసం డిజిటల్ మిషన్ కమిటీని నియమించిందని తెలిపారు. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరికి మాత్రమే అవకాశం దక్కిందన్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ఉంటారని చెప్పారు. తన మీద నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను ప్రజల కోసం ఉపయోగిస్తానన్నారు. తనను నియమించిన కేంద్ర ప్రభుత్వం, సహకరించిన సంఘ పెద్దలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.